క్లుప్తంగా

రూ.1.50 కోట్లతో రోడ్డు మరమ్మతులు



అరకు-విశాఖ రోడ్డులో రంగాపురం వద్ద చేపడుతున్న మరమ్మతులు

లక్కవరపుకోట: అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో ఎల్.కోట మండలం గొల్లుస్టార్ జంక్షన్ నుంచి ఎస్.కోట మండలం బొడ్డవర వరకు మరమ్మతుల పనులు చురుగ్గా సాగుతున్నాయి. 22 కిలో మీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసిందని నేషనల్ హైవే డీఈ నర్సింహరావు గురువారం తెలిపారు.

నియామకపత్రం అందజేత



ఆయాకు నియామకపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని భూపాలపురం అంగన్‌వాడీ కేంద్రానికి హెల్పర్‌గా(ఆయా) నియమితులైన లెంక సుజాతకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విజయనగరంలోని తన క్యాంపు ఆఫీస్‌లో గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్‌లో బోరు ఏర్పాటు



పూజలు చేసి బోరు తవ్వకాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యవంతుడు,తదితరులు

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో తాగునీరు, ఇళ్ల నిర్మాణాల కోసం గురు వారం బోరు తవ్వకాలు చేశారు. ఈ పనులకు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు భూమిపూజ చేశారు. మండల ప్రజా పరిషత్ నిధులు రూ.1.20 లక్షలలో బోరు తవ్వించి, మోటారు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవి తెలిపారు. వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, గ్రామపెద్దలు నూకిరెడ్డి తాతారావు, బొడ్డు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్ భోజంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుజ్జింగివలసలో వైద్య శిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

గుర్ల: మండలంలో గుజ్జింగివలసలోని తెట్టంగి పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరపీడితులు అధికంగా ఉండడంతో వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. శిబిరంలో 80 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించామని వైద్యాధికారి స్వప్న తెలిపారు. శిబిరాన్ని ఎంపీడీఓ కల్యాణి సందర్శించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పారిశుద్ధ్యకార్మికులతో సర్పంచ్ రెడ్డి పద్మావతి బ్లీచింగ్ చల్లించారు.

రోడ్డు పనుల్లో నాణ్యత పరిశీలన



యాతపాలెం వద్ద రోడ్డు పనుల్లో నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

జామి: మండలంలోని అలమండ సంత నుంచి భీమసింగి గ్రామం వరకు చేపడుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ డీఈ వాణి ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆర్అండ్‌బి డీఈ శ్రీనివాస్, జేఈ గుప్తా పాల్గొన్నారు.

రూ.85 లక్షలతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న 5 ఎంవీఏ పీటీఆర్

చీపురుపల్లిరూరల్: మండలంలోని పి.కె.పాలవలస సబ్‌స్టేషన్‌లో రూ.85 లక్షల వ్యయంతో అదనంగా 5 ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్)ను ఆర్‌ఈసీఎస్ అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు, వ్యవసాయ మోటార్లకు మెరుగైన విద్యుత్ అందుతుందని అధికారులు చెప్పారు.

పేదరికం నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీలో సచివాలయం-4 పరిధిలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కుమ్మరివీధి, బ్రాహ్మణ వీధిలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పథకాలు మంజూరు చేస్తున్నామని, రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా పథకాలకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో సీఎం జగన్ ఇప్పటికే 98 శాతం అమలు చేశారని వివరించారు. 2014 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ అన్ని వర్గాలను మోసం చేసిందని, మళ్లీ అదేరీతిలో మాయమాటలు చెప్పేందుకు టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వస్తారని వారి హామీలు నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. స్థానిక సర్పంచ్ ఎం. ఎర్రారామ స్వామి, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఎంపీటీసీ బాబి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, వార్డు మెంబర్లు జి.ఏడుకొండలు, పూసర్ల రఘు, కారుమూరి కృష్ణ, పార్టీ నాయకులు మేలాస్త్రి అప్పారావు, పెనగంటి చెల్లయ్య, మాధవరావు, కోన ఈశ్వరరావు, సాల్మన్‌రాజు, చలుమూరి రాము పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



జామి: గర్భిణులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ భాగ్యరేఖ



బొండపల్లి: గర్భిణులకు భోజనాలు అందిస్తున్న ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్, సత్యసాయి సేవా సమితి సభ్యులు

బొండపల్లి: ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యురాలు అమృతవల్లి గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించి మందులు అందజేశారు. గర్భిణులకు నెలివాడ గ్రామానికి చెందిన సత్యసాయి సేవా సమితి సభ్యులు భోజనాలు ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గా ప్రసాద్ గర్భిణులకు భోజనాలు వడ్డించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

జామి: గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు వైద్య తనిఖీలు చేయించుకోవాలని జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో 75 మంది గర్భిణులకు గురువారం వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 25 మందిని హైరిస్క్‌గా గుర్తించామని, వీరికి ప్రత్యేక వైద్యసేవలు అందిస్తామని వైద్యాధికారి చెప్పారు. తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నాణ్యమైన భోజనం అందించాలి



పాఠశాలలో భోజనం చేస్తున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులకు సూచించారు. మండలంలోని తామరపల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను గురువారం ఆమె పరిశీలించారు. వంటకాలను రుచి చూశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంఈఓ విజయలక్ష్మి ఆమె వెంట ఉన్నారు.

'స్ఫూర్తి'దాయకం



భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విజయకుమారి,తదితరులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ఫూర్తి ట్రస్ట్ సీఈఓ, ఆ కళాశాల ఒకేషనల్ కోర్సు అధ్యాపకుడు, ఎస్.వి.సన్యాసిరావు విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. ఈ పథకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయకుమారి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు సన్యాసిరావు మాట్లాడుతూ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యే వరకు పథకం కొనసాగుతుందని, సెలవుల అనంతరం వచ్చే విద్యాసంవత్సరంలోనూ కొనసాగిస్తామని చెప్పారు. రోజూ సుమారు 100 మంది వరకు భోజనాలు అందిస్తామని తెలిపారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



గుర్లలో పథకాలను వివరిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

గుర్ల: అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు అన్నారు. మండల కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం రెండో రోజు గురువారం కొనసాగింది. ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించారు. మరో పది రోజుల్లో గ్రామంలో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, సర్పంచ్ ఇజ్జిరోతు రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, జమ్ము స్వామినాయుడు, ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం, చందక రమేష్, మంత్రి వెంకటరమణ, వాల్తే భానుచంద్రరావు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

శృంగవరపుకోట: మండలంలో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు సీజ్ చేసిన ఇసుకను కోర్టు ఆదేశాల మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు గురువారం తెలిపారు. 5 కేసుల్లో సీజ్ చేసిన 16 మెట్రిక్ టన్నుల ఇసుకకు వేలం వేస్తున్నామని ఔత్సాహికులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

సంక్షిప్తంగా...

కళాశాలలో ఆధార్ సేవలు



కళాశాలలో ఆధార్ సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగి

గంట్యాడ: స్థానిక ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేకం ఆధార్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సెంటర్‌ను ప్రిన్సిపాల్ జగన్నాథరావు గురువారం ప్రారంభించారు. విద్యార్థులు అంతా ఆధార్ కార్డులు అప్‌డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ద్వాక్రా సంఘానికి రేషన్ డిపో బాధ్యతలు

లక్కవరపుకోట: మండలంలోని ఖాసాపేట రేషన్ డిపో నిర్వహణ బాధ్యతలను తాత్కాలికంగా అదే గ్రామానికి చెందిన శారదా ద్వాక్రా సంఘానికి అప్పగించామ ని, డీలర్‌గా ఆ సంఘం అధ్యక్షురాలు గేదెల లావణ్య వ్యవహరిస్తారని తహసీల్దార్ టి.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రేషన్ డిపోలో ఇటీవల విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వారు దాడులు చేశారని, సరుకుల పంపిణీలో అవకతవకలను గుర్తించి డీలర్ ఇనుపుచప్ప పార్వతిపై 6-ఏ కేసునమోదు చేసినట్లు తెలిపారు. కేసు విచారణ పూర్తయ్యేవరకు తాత్కాలిక డీలర్‌గా లావణ్య పనిచేస్తారని చెప్పారు.

అదనపు పోలింగ్ కేంద్రానికి ప్రతిపాదనలు

లక్కవరపుకోట: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో రెండో కేంద్రం ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించామని తహసీల్దార్ టి.రామకృష్ణ గురువారం తెలిపారు. ప్రస్తుతం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఒక పోలింగ్ కేంద్రం ఉందని, నిబంధనల ప్రకారం 1400 ఓట్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండాలని చెప్పారు. మండలంలో ప్రస్తుతం 1,480 మంది పట్టభద్రులకు ఓటుహక్కు వచ్చిందని, ఎన్నిక సమయానికి ఆన్‌లైన్‌లో మరింతమంది ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉన్నందున, అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు అవసరాన్ని కలెక్టర్‌కు నివేదించామని స్పష్టం చేశారు.

13 నుంచి ఆలయ వార్షికోత్సవాలు

కొత్తవలస రూరల్: మంగళపాలెంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గురుదేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు గురువారం తెలిపారు. 13 నుంచి 17వ తేదీ వరకు రోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించ నున్నట్లు పేర్కొన్నారు. 16న శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా సుమారు 1000 మంది దంపతులకు షష్టిపూర్తి చేయనున్నామని, 60 ఏళ్ల పైబడిన దంపతులు తమపేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించండి

దత్తిరాజేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చి 13న నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షెడ్యూల్‌ను విడుదల చేసిందని, గురువారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ పక్కగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మార్చి 16 వరకు కోడ్ అమల్లో ఉంటుందని, గ్రామాల్లో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు,బ్యానర్లను తొలగించాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు.

సమన్యాయం చేస్తాం



మాట్లాడుతున్న సర్పంచ్ కొండమ్మ

గజపతినగరం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండల కేంద్రంలో రహదారిని ఆనుకుని ఉన్న పంచాయతీ స్థలంలో దుకాణాలను కోల్పోయిన వారికి, మిగులు స్థలం దుకాణాలకు కేటాయింపులో సమన్యాయం పాటిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని గజపతినగరం సర్పంచ్ నరవ కొండమ్మ తెలిపారు. మండల కేంద్రంలో వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించారు. వ్యాపారులు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా పంచాయతీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నామని, రోడ్డు విస్తరణలో షాపులు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని కోరారు. సర్పంచ్ కొండమ్మ,వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు స్పందిస్తూ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి సమస్యను తీసుకువెళ్లామని, రోడ్డు విస్తరణలో పోగా మిగిలిన భూమిని దుకాణాలకు కేటాయింపులో గతంలో దుకాణాలు ఉన్న వారికి తొలిప్రాధాన్యం ఇవ్వాలని సూచించారని చెప్పారన్నారు. పంచాయతీ నిబంధనల మేరకు వ్యాపారులే దుకాణాలు నిర్మించుకునేలా తీర్మానం చేశారు. ఈఓపీఆర్డీ జనార్దనరావు, పంచాయతీ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

ఫార్మేటివ్-3 పరీక్షలు



పురిటిపెంట పాఠశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: మండలంలోమూడవ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్-3 పరీక్షలు జరుగుతున్నాయని ఎంఈఓ విమలమ్మ తెలిపారు. పురిటిపెంట రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన పరీక్షలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు అందించాలని పథకం నిర్వాహకులకు సూచించారు. ఎంఈఓ వెంట సీఆర్పీ రెడ్డి ఉన్నారు.

రెండు లారీల ఢీ..నలుగురికి గాయాలు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామం వద్ద జాతీయ రహదారి-26పై గురువారం వేకువజామున ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు బలంగా ఢీకొన్నాయి. ప్రమాదంలో లారీల ముందు భాగాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రెండు లారీల్లోని ఇద్దరు డ్రైవర్లతో పాటు, ఇద్దరు క్లీనర్లు స్వల్పగాయాలతో బయట పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా లారీలను పక్కకు తరలించారు గాయాల పాలైన డ్రైవర్లు, క్లీనర్లను విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

నేత్ర, అవయవదానాలపై అవగాహన

చీపురుపల్లిరూరల్: మండలంలోని పుర్రేయవలస గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు చీపురుపల్లి పట్టణానికి చెందిన మానవీయతా స్వచ్ఛందసంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు నేత్ర, అవయవదానాలపై గురువారం అవగాహన కల్పించారు.మరణానంతరం నేత్రాలు, శరీర అవయవాలు మట్టిలో కలిసిపోకుండా వేరొకరికి ఉపయోగపడేలా దానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. నేత్ర, అవయదానాలపై అపోహలు వీడాలని సూచించారు. నేత్ర,అవయవదానాలు చేస్తామని వేతనదారులతో ప్రతిజ్ఞ చేయించి పలువురి నుంచి అంగీకార పత్రాలను స్వీకరించారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



చీపురుపల్లి: మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు



వేపాడ: డ్రగ్స్ జోలికి పోవద్దని యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

చీపురుపల్లి: యువత మాదక ద్రవ్యాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని, మత్తుపదార్థాలు,చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సన్యాసినాయుడు సూచించారు. మాదకద్రవ్యాల రవాణా,వినియోగం,నియంత్రణపై స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ చాలా మంది యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలు,మత్తు పదార్థాలు సేవించిన వారిపై,విక్రయించిన వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొంతమంది అనుమానిత వ్యక్తుల నుంచి ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.

డ్రగ్స్ జోలికి వెళ్లవద్దు

వేపాడ: జీవితాన్ని, ఆరోగ్యాన్ని నాశనం చేసే డ్రగ్స్ జోలికి పోవద్దని మండల కేంద్రంలో యువతకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ గురువారం అవగాహన కల్పించారు. యువత చెడువ్యసనాలపై కాకుండా భవిష్యత్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రధాన జంక్షన్‌లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



కొత్తవలస: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ బాలసూర్యారావు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కొత్తవలస: నిరుద్యోగ యువత, విశ్రాంత ఉద్యోగులు,మహిళలను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాలు రెచ్చిపోతున్నారని, ఇలాంటి మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ ఎస్.బాలసూర్యారావు సూచించారు. మండల కేంద్రంలో ప్రయాణికులు, స్థానికులకు సైబర్ నేరాలు,దిశ యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ మీకు లాటరీ వచ్చిందని, మంచి బహుమతులను పంపిస్తామని, ఇంటి వద్ద ఉంటూనే నెలకు వేల రూపాయలు సంపాదించుకోవచ్చని సైబర్ నేరగాళ్లు ఫోన్‌లు చేస్తుంటారని, అలాంటి వాటికి స్పందించవద్దని సూచించారు.

పౌష్టికాహారం పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ అప్పారావు

వేపాడ: ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికాహారం కిట్లను అయిదుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు స్థానిక పీహెచ్‌సీలో జెడ్పీటీసీ ఎస్.అప్పారావు గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నయమవుతుందని చెప్పారు. వైద్యాధికారి ధరణి, సీహెచ్‌ఓ ఆంజనేయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

బక్కునాయుడుపేట గురుకుల బాలికల పాఠశాలలో 56 మంది విద్యార్థినులకు వైద్యాధికారి ధరణి గురువారం వైద్య పరీక్షలు చేశారు. వివిధ ఆరోగ్య సమస్యలు ఉన్న 12 మందికి ఉచితంగా మందులు అందజేశారు.

మెరుగైన వైద్యసేవలందించాలి



శృంగవరపుకోట: మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సుధారాజు

గంట్యాడ: పీహెచ్‌సీ సిబ్బంది అన్నివేళలా అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎంపీపీ పీరుబండి హైమావతి సూచించారు. పెదమజ్జిపాలెం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్పత్రిని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో పాడైన కంప్యూటర్లు , ఇన్వర్టర్స్ కొనుగోలు చేయడానికి, ఇతర అభివృద్ధి పనులకు కమిటీ తీర్మానం చేసింది. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, పీహెచ్‌సీ వైద్యులు జగదీష్ , సుల్తాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగార్చకండి

శృంగవరపుకోట: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఆ లక్ష్యాన్ని నీరుగార్చేయకుండా సేవలందించాలని ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎస్.సోమేశ్వరరావు, సుధారాజు వైద్యారోగ్య శాఖ సిబ్బందిని కోరారు. కొట్టాం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ సుధారాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరిగా వైద్యసేవలు అందవన్న అపప్రదను తొలగించేలా సిబ్బంది పనిచేయాలని అన్నారు. వైద్యులు లావణ్య,హారిక, సర్పంచ్ మీన, ఎంపీడీఓ శేషుబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ఇంటింట సర్వే



బర్మాకాలనీలో సర్వే చేస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట: ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పుణ్యగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు అధ్యక్షతన, కో-ఆర్డినేటర్ బి.సంధ్యారాణి నేతృత్వంలో గురువారం ఇంటింట సర్వే చేశారు. కళాశాల దత్తత గ్రామాలైన పుణ్యగిరి, బర్మాకాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా, వివిధ పథకాల ద్వారా పొందిన ఉపాధి మార్గాలు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు, ఆర్థిక స్థితిగతులపై ప్రజలను ఆరా తీశారు.

మూగజీవాలకు పీపీఆర్ టీకాలు



గొర్రెలకు టీకాలు వేయిస్తున్న పశువైద్యాధికారి గాయత్రి

లక్కవరపుకోట: మండలంలోని ఖాసాపేట గ్రామంలో 650 గొర్రెలు, 150 మేకలకు పారుడు వ్యాధి నివారణ (పీపీఆర్) టీకాలను మండల పశువైద్యాధికారి కె.గాయత్రి ఆధ్వర్యంలో గురువారం వేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ మండలానికి 28,950 టీకాలు వచ్చాయని, ఇప్పటి వరకు 9,800 వేశామని చెప్పారు. ఈ నెల 28వ తేదీ వరకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సచివాలయ వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి



మాట్లాడుతున్న హార్టీకల్చర్ ఏడీ శైలజ

గంట్యాడ: రైతు ఉత్పత్తిదారుల సంఘం అభివృద్ధికి సభ్యులు సమష్టిగా కృషి చేయాలని ఉద్యానవనశాఖ ఏడీ శైలజ అన్నారు.మండలంలోని కొర్లాం గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులకు గురువారం శిక్షణ ఇచ్చారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం బైలా నిర్వాహణ, మూలధనం అభివృద్ధి ఏవిధంగా చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించి, వాటిని సద్వినియోగించుకోవాలని సూచించారు.

నేత్ర వైద్యశిబిరం



వృద్ధురాలికి కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ జాక్సన్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో పోరలి గ్రామానికి చెందిన సహాయ స్ఫూర్తి ఫౌండే షన్ అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ ఆధ్వర్యంలో గురువారం నేత్రవైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో శంకర్ ఫౌండేషన్‌కు చెందిన ఆప్తాలమిక్ జాక్సన్ 67 మందికి కంటి పరీక్షలు చేసి, 25 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి ఉచితంగా కంటి ఆపరేషన్ చేసి కళ్లద్దాలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్ఐ బి.భాగ్యం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా మల్లికార్జునస్వామి తీర్థం



ఎడ్ల పరుగు పోటీలను తిలకిస్తున్న ప్రజలు

వేపాడ: మండలంలోని నల్లబిల్లిలో భ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి తీర్థం మూడోరోజు గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి వేదపండితులు ప్రత్యేక పూజలు, కల్యాణం జరిపించారు. సాయంత్రం ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించారు. విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 16 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా, మొదటి ఆరుస్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు.